# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అభివృద్ధిని స్వీకరిస్తూ.. సాంస్కృతిక మూలాలను పరిరక్షించుకున్న రాష్ట్రం గోవా అని ఉప రాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ అన్నారు.
- ❖ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడమే “ఖేత్ బచావో అభియాన్” ప్రధాన లక్ష్యమని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.
- ❖ భారత్‌ను ప్రపంచ తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ సమాధాన్ దీదీ.. ప్రభుత్వ ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ప్రజాస్వామ్యీకరించే దిశగా కీలక ముందడుగు అని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు.

====================

అభివృద్ధి, సంస్కృతి, వారసత్వాల పరిరక్షణను విజయవంతంగా సమతుల్యం చేసుకున్న గోవా.. ఒక ఆదర్శ రాష్ట్రమని ఉప రాష్ట్రపతి సీ. పీ. రాధాకృష్ణన్ అన్నారు. గోవా 40వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పనాజీలోని కళా అకాడమీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆధునిక అభివృద్ధిని స్వీకరిస్తూనే గోవా తన సాంస్కృతిక మూలాలను పరిరక్షించుకుందని అన్నారు. గోవా ఒక పర్యాటక కేంద్రం మాత్రమే కాదని, సాంస్కృతిక మార్పిడి, సామాజిక సామరస్యం, మేధోపరమైన స్వేచ్ఛతో రూపుదిద్దుకున్న ఒక సజీవ నాగరికతగా అభివర్ణించారు. అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ అవగాహన, మానవ అభివృద్ధి రంగాలలో రాష్ట్రం సాధించిన విజయాలను ఉప రాష్ట్రపతి ప్రశంసిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

కాగా.. ఉపరాష్ట్రపతి రేపు కేరళంలో పర్యటించనున్నారు. కొట్టాయంలో మలయాళ దినపత్రిక దీపిక 140వ వ్యవస్థాపక వార్షికోత్సవాలను ప్రారంభించి, రాజ్యసభ సభ్యుడు సి. సదానందన్ మాస్టర్ కన్నూర్‌లో నిర్వహించే ఒక కార్యక్రమంలో కూడా పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = =

`ఖేత్ బచావో అభియాన్`ను పొలాలు, రైతులు, గ్రామాలను అనుసంధానించే ఒక సమగ్ర జాతీయ ప్రచారంగా మార్చాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. న్యూఢిల్లీలో ఖేత్ బచావో అభియాన్ సన్నాహాలకు సంబంధించి ఈరోజు జరిగిన ఉన్నత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఎరువుల సమతుల్య, వివేకవంతమైన వినియోగం, వాతావరణ సవాళ్లకు సంబంధించి రైతులకు సకాలంలో సలహాలు ఇవ్వడం, పంచాయతీ స్థాయిలో భాగస్వామ్యం, పథకాల ప్రయోజనాలను నేరుగా గ్రామాలకు అందించడం మొదలైన అంశాలపై ఈ ప్రచారం ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. రసాయన ఎరువుల విచక్షణారహిత వినియోగాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారత్‌ను ప్రపంచ తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (AMTZ) ను ఆయన ఈరోజు సందర్శించి, వైద్య పరికరాల తయారీ యూనిట్లు, పరిశోధన, ఆవిష్కరణ కేంద్రాలు, ఇతర పారిశ్రామిక మౌలిక సదుపాయాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. AMTZ లోని సౌకర్యాలు ఆరోగ్య సంరక్షణ సాంకేతికత, అధునాతన తయారీ రంగాలలో భారతదేశ బలాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. దేశీయ ఉత్పత్తిని పెంచడానికి, ప్రపంచ మార్కెట్లలో భారత్ స్థానాన్ని బలోపేతం చేయడానికి ఈ రంగం మెరుగైన అవకాశాలను అందిస్తుందని గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ న్యూఢిల్లీలో AI ఆధారిత సి.పి. గ్రామ్స్ (CPGRAMS) వాయిస్ చాట్‌బాట్, "సమాధాన్ దీదీ"ని ఈరోజు ప్రారంభించారు. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ, భాషిణి సహకారంతో అభివృద్ధి చేసిన ఈ చాట్‌బాట్.. ఒక ఇంటరాక్టివ్ సంభాషణా వేదిక ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... సమాధాన్ దీదీ ప్రభుత్వ ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ప్రజాస్వామ్యీకరించే దిశగా ఒక కీలక ముందడుగు అని వ్యాఖ్యానించారు. `సమాధాన్ దీదీ` ప్రస్తుతం దేశంలోని 22 షెడ్యూల్డ్ భాషలకు మద్దతు ఇస్తోందని, మరికొన్ని ప్రాంతీయ భాషలను చేర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి చెబుతూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

రాజ్యాంగం, చట్టాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు కట్టుబడి దేశంలో ఎన్నికలు జరుగుతాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ అన్నారు. న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (IIIDEM)లో ఎన్నికల సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదుల 2వ జాతీయ సదస్సులో ఆయన ఈరోజు ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో పారదర్శకత, జవాబుదారీతనంతో స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సుమారు కోటి 80 లక్షల మంది సిబ్బంది సేవలను వినియోగిస్తామని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి - సేతు పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ కోసం, ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా అనే ప్రైవేట్ కంపెనీ సమర్పించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళిక (SIP)కు జాతీయ స్టీరింగ్ కమిటీ (NSC) ఆమోదం తెలియజేసింది. న్యూఢిల్లీలో నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ (MSDE) ఆధ్వర్యంలో జరిగిన 3వ NSC సమావేశంలో ఈ ఆమోదం లభించింది. మారుతున్న శ్రామిక శక్తి అవసరాలకు అనుగుణంగా స్పందించగల, పరిశ్రమలచే నిర్వహించబడే, ఫలిత-ఆధారిత సంస్థలుగా పారిశ్రామిక శిక్షణా సంస్థ (ITI)లను మార్చడంలో ఇది ఒక కీలకమైన ముందడుగు అని MSDE పేర్కొంది. ఈ పథకం కింద ఒక పారిశ్రామిక భాగస్వామ్యాన్ని కార్యాచరణలోకి తెచ్చిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = =

లిథియం బ్యాటరీలు, శాశ్వత అయస్కాంతాలు ఆధునిక సాంకేతికతలలో కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లో సుస్థిరమైన కీలక ఖనిజాలను, అధునాతన పదార్థాలను ఉత్పత్తి చేస్తున్న లోహమ్ అంకుర సంస్థను ఆయన ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ… లిథియం బ్యాటరీలు, శాశ్వత అయస్కాంతాలను భారతదేశంలోనే తయారు చేయాలని, అలాగే ఈ సాంకేతికతను దేశీయంగా అభివృద్ధి పరచాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఈ దార్శనీకతకు అనుగుణంగా, లోహమ్ సంస్థ ఒక సంక్లిష్టమైన సాంకేతికతను విజయవంతంగా అభివృద్ధి పరిచినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

రానున్న 4 - 5 రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళం, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు చేరుకోవడానికి వాతావరణ పరిస్థితులు మరింత అనుకూలంగా మారుతున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలియజేసింది. ఈ రుతుపవనాలు అరేబియా సముద్రం, బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలతో పాటు లక్షద్వీప్, కన్యాకుమారి ప్రాంతాలకు కూడా విస్తరించాయి. కేరళంలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రేపు 6 జిల్లాలకు, ఎల్లుండి 8 జిల్లాలకు ఐఎండీ ఎల్లో ఎలర్ట్ జారీ చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జూన్ 3 వరకు కేరళం, లక్షద్వీప్ తీరాల్లో సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్-2026 క్రికెట్ ఫైనల్ మ్యాచ్ రేపు జరగనుంది. గత సంవత్సరం ఛాంపియన్‌గా నిలిచిన ఆర్సీబీ.. ఈ సీజన్‌లోనూ సత్తాచాటి ఫైనల్స్‌కు చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది. ఈ మ్యాచ్ రేపు రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ).. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడుతూ, సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తోందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష-2023 ఫలితాలకు సంబంధించి తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చినందుకు గాను ఒక ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌కు సీసీపీఏ 7 లక్షల రూపాయల జరిమానా విధించిందని సామాజిక మాధ్యమం పోస్టులో ఆయన ఈరోజు తెలిపారు. కోచింగ్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయమైన పద్ధతులను నిర్ధారించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ చర్య ప్రతిబింబిస్తుందన్నారు. సీసీపీఏ ఇప్పటివరకు 60కి పైగా కోచింగ్ సంస్థలకు నోటీసులు జారీ చేసి.. కోటీ 46 లక్షల రూపాయలకుపైగా జరిమానాలు విధించిందని కేంద్రమంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =